క్లుప్తంగా

రుచికరమైన భోజనం పెట్టండి

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్నభోజనం పథకంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని పెట్టాలని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీకాళహస్తి: కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంప్లాయీస్ యూనియన్ శ్రీకాళహస్తి శాఖ గౌరవాధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ సర్వసభ్య సమావేశం బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో నిర్వహించారు. యూనియన్ నాయకులు మస్తాన్, సత్యనారాయణ, సతీష్‌నాయుడు, శ్రీనివాస్, కుమార్, సూరిబాబు, నరసింహులు, కేసీ రెడ్డి, రత్నం, కుప్పయ్య పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

నారాయణవనం: వైద్యుల నిరసనలో భాగంగా బుధవారం మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్, పీహెచ్‌సీ డాక్టర్ రాగసుధ నల్ల బ్యాడ్జీలు ధరించి, విధులు నిర్వహించి, నిరసన తెలిపారు. జీఓ నంబర్ 85ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నత్తం హరిబాబుకు దళితవీర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నత్తం హరిబాబు

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, దళిత బహుజన ఫ్రంట్ రాయలసీమ కోఆర్డినేటర్ నత్తం హరిబాబు మంగళవారం గుంటూరులో ఎస్టీ రైల్వే యూనియన్ హాల్‌లో దళితవీర్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు.

కేవీబీపురం ఎస్‌ఐగా వీరాంజనేయులు



వరదయ్యపాళెం: కేవీబీపురం మండల ఎస్ఐగా వీరాంజనేయులు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ బదిలీపై వెళ్లడంతో గత కొంతకాలంగా ఈ పోస్టు భర్తీ కాలేదు. అయితే మండలంలో వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా జరిగిన వివాదాల దృష్ట్యా తక్షణమే ఎస్పీ స్పందించి ఎస్ఐ పోస్టును భర్తీ చేశారు.

చేతి వృత్తులతో ఆర్థికాభివృద్ధి

రేణిగుంట: చేతి వృత్తులతో మహిళల ఆర్థిక పురోభివృద్ధి సాధ్యమవుతుందని రాస్ సాదుపు సంఘాల డైరెక్టర్ నాగరాజు అన్నారు. మండలంలోని కరకంబాడి ఇందిరానగర్ రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం రాస్- జన శిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత గతంలో టైలరింగ్, ఆర్య వర్క్ నేర్చుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం శిక్షణ సర్టిఫికెట్లను, ఇప్పుడు నేర్చుకునే వారికి మెటీరియల్‌ని అందజేశారు. కరకంబాడి కెనరా బ్యాంకు మేనేజర్ సిద్దు, జన శిక్షణా సంస్థాన్ కోఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి, రాస్ ట్రస్టీలు రమేష్ రెడ్డి, సుబ్బరత్నమ్మ, నిత్య సుధా, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ గిరిప్రసాద్, అన్బలగన్, ఇందుమతి ,నాగమణి, స్వాతి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ: దోమకాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు జ్వరాలు, బోధకాలపై అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన కాటూరులోని దళితవాడ, గిరి జన కాలనీల్లో దోమల నివారణ, దోమలతో వచ్చే వ్యాధులపై, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టాలని, బాల్య చట్టరీత్యా నేరమని సీహెచ్ఓ వేంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కాటూరు గ్రామ గిరిజన మహిళలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు.

పెట్టుబడి సాయం ఏది బాబూ?

శ్రీకాళహస్తి: ఖరీఫ్ సీజ్ ప్రారంభమై మూడు నెలలు దాటిపోతున్నా రైతాంగానికి ఇస్తానన్న రూ.20 వేలుపెట్టుబడి సాయం ఏదని సీఎం చంద్రబాబును రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత ప్రశ్నించారు. రైతాంగ సమస్యలు, గత ఎన్నికల ఇచ్చిన హామీల అమలుపై స్థానిక ఎస్‌డీకే నగర్ సచివాలయం వద్ద రైతు సంఘం నాయకులు బుధవా రం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ గత ఎన్నికల్లో రైతులు, కౌలు రైతుల మద్దతుతో ఎన్డీయే కూటమి భారీ మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. అయితే రైతులకు అండగా ఇస్తానన్న పెట్టుబడి సాయాన్ని ఇంత వరకు విడుదల చేయలేదని మండిపడ్డారు. చంద్రబాబు పెట్టుబడి సాయం విడుదల చేసి ఉంటే రైతులు, కౌలు రైతులు బ్యాంకుల చుట్టు తిరగాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం.. పులకించిన భక్త జనం



వరదయ్యపాళెం: బజారు వీధిలో యువత సందడి



నాగలాపురంలో విగ్రహాన్ని ఊరేగిస్తున్న యువకులు



బుచ్చినాయుడుకండ్రిగలో అన్నదానం

నారాయణవనం: వినాయకుడి నిమజ్జన ఊరేగింపు





నారాయణవనం: పూజలందుకుంటున్న వినాయకుడు



ఏర్పేడు గొల్లవీధిలో వినాయకుని ఊరేగింపు



నారాయణవనం: అన్నదానం

భక్తజనం పులకరించిపోయింది. యువకుల కేరింతలు..హోరింతలు.. గణపతి బొప్పా మోరియా అంటూ భక్తిభావంతో పరవశించిపోయింది. సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజక వర్గాల్లోని పలు పల్లెలో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకులను బుధవారం నిమజ్జనం చేశారు. సంప్రదాయంగా పూజలు చేసి, ఊరేగింపుగా తీసుకెళ్లి జలవనరుల్లో బొజ్జగణపయ్యను కలిపారు. – సాక్షి నెట్‌వర్క్



ఏర్పేడు: అంజిమేడులో..



సత్యవేడు: ఎన్ఆర్ అగ్రహారంలో గణపతి ఊరేగింపు



బుచ్చినాయుడుకండ్రిగలో నిమజ్జనం పాల్గొన్న యువకులు



సత్యవేడు: పల్లావీధిలో..

ఘనంగా ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న సిరాజ్‌బాషా



నాగలాపురంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుపతి జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా ఆధ్వర్యంలో పట్టణంలోని బీడీ కాలనీ, రామచంద్రాపురం, ఎస్టీకాలనీలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇస్మాయిల్, షేక్ షాహీ, జమీర్, మహబూబ్‌బాషా, మీర్జావలి, రాజా, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: వైఎస్సార్ సీపీ పిచ్చాటూరు మండల మాజీ కన్వీనర్ హరిచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ మిథున్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రోసిరెడ్డి, కారూరు ఎంపీటీసీ సభ్యులు వేలు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, సీనియర్ నాయకులు భూపతి శెట్టి, గోవిందన్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు వెరిఫికేషన్ సర్వే పక్కాగా నిర్వహించాలి



రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: బీఎల్‌ఓలు ఓటరు వెరిఫికేషన్ సర్వేను ఇంటింటికీ తిరిగి పక్కాగా నిర్వహించి, లోపాలు లేని, పారదర్శకమైన ఫొటో ఎలక్టోరల్ రోల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. రేణిగుంటలోని పాంచాలినగర్‌లో బుధవారం బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఆర్ -2025 ఇంటింటి సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పక్కాగా ఇంటింటి ఓటరు జాబితా వెరిఫికేషన్ చేసి, లోపాలు లేని ఫొటో ఎలక్టోరల్ రోల్ తయారు చేయాలని, ఏదైనా పొరపాట్లు వస్తే తప్పక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రీకాళహస్తి ఆర్డీఓ రవి శంకర్ రెడ్డి, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ విష్ణుచిరంజీవి పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో తనిఖీ

శ్రీకాళహస్తి: స్థానిక ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి మొత్తం తిరిగి చికిత్స పొందుతున్న రోగులను వైద్యసేవలపై ఆరా తీశారు. శస్త్రచికిత్సలు, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కింద చేస్తున్నారా?లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లాబోరేటరీని పరిశీలించి ఆధునిక పరికరాలు, తదితరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఆర్ఎంఓ మధు, వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

పరశురామేశ్వర స్వామి సేవలో కేంద్ర సహాయమంత్రి



పరశురామేశ్వర స్వామి ఆలయంలో కేంద్ర సహాయక మంత్రి సురేష్ గోపి, కుటుంబ సభ్యులు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో కేంద్ర సహాయమంత్రి సురేష్ గోపి, కుటుంబ సమేతంగా బుధవారం పూజలు చేశారు. ముఖద్వారం వద్ద ఆలయ చైర్మన్ గిరినాయుడు, ఈఓ రామచంద్రారెడ్డి, అర్చకులు వంశీకృష్ణ శర్మ, పవన్‌కుమార్ శర్మ వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి సేవలో..

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం కేంద్ర టూరిజం శాఖ సహాయమంత్రి సురేష్‌గోపి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయన్ని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

అగస్త్యేశ్వరస్వామికి పవిత్రాల సమర్పణ

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ ఆలయమైన మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మూల, ఉత్సవమూర్తులకు బుధవారం పవిత్రాల సమర్పించారు. ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. యాగశాలలో కలశస్థాపన చేసి శాంతి, వాస్తు, గ్రహ పూజలను, హోమాలను రిత్వికులు నిర్వహించారు. యాగశాలలో పూర్ణాహుతి చేసి, రిత్వికులు పవిత్రాలను మూల, ఉత్సవ విగ్రహాలకు, పరివార దే వతలకు పట్టు పవిత్రాలను సమర్పించారు. కార్యక్రమాల్లో స్థానిక టీటీడీ ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న మాజీ సైనికోద్యోగి అమ్ములునాయుడు, అతని సోదరి జ్యోతి

రేణిగుంట: పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి కోసం ఇల్లు, పంట పొలాలను కోల్పోయామని, తమకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని మాజీ సైనిక ఉద్యోగి అమ్ములు నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన గుత్తివారిపల్లిలో తనకు జరిగిన అన్యాయాన్ని మీడియాకు వివరించారు. గుత్తివారిపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 152-9లో తన కుటుంబానికి 3.23 ఎకరాలు డీకేటీ భూమి ఉందన్నారు. అక్కడ తాము ఏళ్ల తరబడి వ్యవసాయం చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ రహదారి విస్తరణ కోసం తాము ఉంటున్న ఇల్లును కూల్చివేశారని వాపోయారు. అలాగే ఆ భూమిలో 1.56 ఎకరాలు భూమి కూడా కోల్పోయామన్నారు. అయితే పరిహారం ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం తాము తాత్కాలిక రేకుల షెడ్డులో ఉంటున్నామని తెలిపారు. తమ స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి పునాదులు తవ్వితే వీఆర్వో వచ్చి కట్టనివ్వకుండా అడ్డుకుంటున్నట్లు ఆరోపించారు. తమ మిగిలిన భూమిలో ఆంజనేయ స్వామి గుడి కట్టుతున్నారని, తాము 5సెంట్లు ఆలయానికి ఇస్తామని చెప్పినా, గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మునస్వామినాయుడు, ఆయన కుమారుడు శోభన్‌బాబు ప్రోద్బలంతో తమపై దౌర్జన్యం చేసి వేధిస్తున్నారన్నారు. మాజీ సైనికోద్యోగి అయిన తనకే న్యాయం జరగలేదన్నారు. అధికారులు కూడా వారికే వంతపాడుతూ తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. తమ భూమిలో దౌర్జన్యంగా బోరు వేసేందుకు వచ్చిన వ్యక్తిని అడ్డుకుంటే, తన సోదరి జ్యోతిని రేణిగుంట ఎస్ఐ వృద్ధురాలు అని చూడకుండా తాట తీస్తానంటూ అవమానకరంగా మాట్లాడారని, అతనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

వంద రోజులు పనులు కల్పించాలి

ఏర్పేడు: జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని నచ్చనేరి పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఓ లుచంద్రశేఖర్‌రాజు, దేవరి, కూలీలు పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించాలి

శ్రీకాళహస్తి: విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని రాష్ట్ర సాంఘిక గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయ అధికారి పద్మజ సూచించారు. బుధవారం ఆమె స్థానిక కాసాగార్డెన్‌లోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, తరగతి గదులు, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పనితీరును ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. వారి సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ఏర్పేడు: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని హెచ్ఎం నిర్మల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బండారుపల్లె హైస్కూల్‌లో స్వచ్ఛతా పక్వాడాలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, గుణశేఖర్‌రెడ్డి, కుమార్ రాజా, ఉమామహేశ్వర్, సురేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకు వితరణ

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం అంగన్‌వాడీ కేంద్రానికి బుధవారం రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింథటిక్ నీటి ట్యాంకు, కుళాయిలు వితరణ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త భువనేశ్వరి విన్నపం మేరకు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ రమేష్‌నాథ్ లింగుట్ల 500 లీటర్ల సామర్థం కలిగిన నీటి ట్యాంకు, కొళాయిలను అందజేశారు.

వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలి

శ్రీకాళహస్తి: యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలని గ్లోబల్ విజ్ఞాన సేవా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జీఎస్ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వద్ద వివేకనందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొనగంటి భాస్కర్, జనసేన నాయకులు ఈశ్వర్ రాయల్ పాల్గొన్నారు.

మట్టిని మింగుతున్న పచ్చ నేతలు

శ్రీకాళహస్తి రూరల్: టీడీపీ నాయకులు చెరువులో మట్టిని అమ్ముకుని, సొమ్ము చేసుకుంటున్నారు. శ్రీకాళహస్తి మండల పరిధిలోని పుల్లారెడ్డి కండ్రిగ చెరువులో బుధవారం స్థానిక టీడీపీ నాయకులు ట్రాక్టర్లతో మట్టిని అక్రమ రవాణా సాగిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరులో పోలేరమ్మ అమ్మవారికి ఘనంగా పొంగళ్లు పెట్టారు. గ్రామంలోని రజక పెద్ద కల్లేటి కొండయ్య ఆధ్వర్యంలో పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. గ్రామ పెద్దలు ప్రతాప్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, రవి ఆచారి, భాస్కర్ రెడ్డి, పరంధామరెడ్డి, సురేష్ రెడ్డిలు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కేబీ గురుదేవ్ పిలుపునిచ్చారు. బుధవారం వరదయ్యపాళెం మండలంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఓబీసీ మోర్చా ఆఫీస్ బ్యారర్ సిద్ధలయ్య, పురుషోత్తమ్ పాల్గొన్నారు.

చవితి వేడుకల్లో వ్యక్తి మృతి

వరదయ్యపాళెం: చవితి వేడుకల్లో ఒకరికొకరు సరదాగా పెట్రోల్ చల్లుకుని నిప్పు పెట్టిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కేవీబీపురం మండలం కర్లపూడిలో చోటుచేసుకుంది. చవితి ఉత్సవాల్లో భాగంగా కర్లపూడిలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహం వద్ద ఈనెల 7వ తేదీ సాయంత్రం చెరివి చంద్రయ్య (48), మరికొందరు విగ్రహం ఎదురుగా ఉన్న రచ్చబండ వద్ద సరదాగా గడుపుతున్నారు. ఆ సమయంలో బి.సూర్యకుమార్ అనే వ్యక్తి పెట్రోల్ నింపిన వాటర్ బాటిల్ చేతిలో పెట్టుకుని ఉన్నాడు. అయితే ఆ సమయంలో సూర్యకుమార్ మద్యం మత్తులో రచ్చబండ వద్ద ఉన్న చంద్రయ్య వద్దకు వెళ్లి సరదాగా నీళ్లు చల్లాడు. తదుపరి ఒకరికొకరు మాటామాట పెరగడంతో ఏకంగా తన చేతిలో ఉన్న పెట్రోల్‌ను చల్లి నిప్పంటించడంతో ఒక్కసారిగా చంద్రయ్యపై మంటలు అంటుకున్నాయి. దీంతో అక్కడున్న స్థానికులు మంటలు ఆపే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే చంద్రయ్య తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం శనివారం రాత్రి తిరుపతికి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఈ నెల 7న కేవీబీపురం పోలీస్ స్టేషన్‌లో సూర్య కుమార్‌పై కేసు నమోదైంది. అయితే నిందితుడిని త్వరలో అరెస్టు చేస్తామని ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు.

పలు చోట్ల వివాదాలు

వరదయ్యపాళెం మండలంలోని కడూరు దళితవాడ, రాచకండ్రిగలో వినాయకచవితి నిమజ్జనోత్సవంలో రెండు వర్గాల మధ్య వివాదాలు తలెత్తాయి. ఆ మేరకు శ్రీసిటీ, వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్లలో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి. రాచకండ్రిగలో రెండు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 17 మందిపై కేసులు నమోదు చేసినట్లు శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ పేర్కొన్నారు. అలాగే కడూరు దళితవాడలో ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంలో వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగహారతి ఊరేగింపు

- ముగిసిన కట్టపుట్టాలమ్మ జాతర



నాగహారతి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడిలో ఉన్న కట్టపుట్టాలమ్మ జాతర బుధవారంతో ముగిసింది. జాతరలో రెండో రోజైన బుధవారం తెల్లవారుజామున దొడ్లమిట్టలోని ఆలయ వంశపారపర్య ధర్మకర్త కుద్రకాల్వ రామచంద్రయ్య, వాసు ఇంట్లో నాగహారతికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి డప్పు వాయిద్యాలు, చిన్నారుల కోలాటాలు, పంబ వాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో నాగహారతిని కట్టపుట్టాలమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అడుగడుగునా మహిళలు కర్పూర హారతులు పట్టి అమ్మవారికి మొక్కుకున్నారు. రామచంద్రయ్య ఇంటికి మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు చేరుకుని నాగ హారతిని దర్శించుకున్నారు. ధర్మకర్త కుద్రకాల్వ వాసు ఆయన్ని గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ నాయకుడు డాలర్స్ దివాకర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు అతిథులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రేణిగుంట పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



రేణిగుంట: కృష్ణాపురంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ హేమావతి

రేణిగుంట: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, వ్యాధి నిరోధక శక్తి పెంచుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమావతి అన్నారు. మండలంలోని కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్, రాస్, చైల్డ్ ఫండ్ ఇండియా సంయుక్తంగా పోషకాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. పోషకాహార ప్రాముఖ్యత, సమతుల ఆహారం ఎలా తీసుకోవాలి, చంటి పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాస్ కో ఆర్డినేటర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందజేస్తున్న పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప తెలిపారు. బుధవారం భవానీశంకరపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. పౌష్టికాహారంతో రక్తహీనత దూరమవుతుందన్నారు. శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమని, తల్లులు తప్పనిసరిగా బిడ్డలకు పాలు తాగించాలన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

ఏర్పేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, పిల్లలు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలని సూపర్‌వైజర్ రత్నమ్మ అన్నారు. బుధవారం మండలంలోని ఆమందూరు, నచ్చనేరి, నాగంపల్లి, బీసీకాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మహోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీ, ధనమ్మ, సునీత పాల్గొన్నారు.